## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బోథ్, సెప్టెంబర్ 2 : బోథ్‌కు చెందిన ఎర్రం భూమేశ్ (44) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు...కొత్త కాలనీకి చెందిన భూమేశ్ భార్య నాలుగు సంవత్సరాల క్రితం భర్తను వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్య కాపురానికి రావడం లేదని మనోవేదనకు గురయ్యాడు. ఈ మధ్య కాలంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్తానని తల్లికి చెప్పి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాలేదు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనంలో భూమేశ్ పురుగుల మందు తాగి చనిపోయి ఉన్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గంజాయి పట్టివేత

బోథ్, సెప్టెంబర్ 2 : మర్లపెల్లి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. సిరిసె వంశీ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన నాందేవ్ నుంచి కొన్ని నెలల క్రితం గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చాడు. తన పొలంలో దాచి ఆదివారం సాయంత్రం సమయంలో ఇతరులకు అమ్మడానికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. మర్లపెల్లి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయితో పట్టుబడ్డాడు. పట్టుబడిన గంజాయి 4.700 కిలో గ్రాములు ఉంటుందని, మార్కెట్‌లో దీని విలువ రూ.లక్షా 17,500 ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. గంజాయి పట్టుకున్నవారిలో హెడ్ కానిస్టేబుల్ రంగారావు,అంబాజీ, కానిస్టేబుల్ నరేశ్ ఉన్నారు.

## ఒకరికి జీవితకాలం జైలు

కుంటాల, సెప్టెంబర్ 2 : కుంటాల మండలం రాజాపూర్‌తండాలో గతంలో పాత కక్షలను మనసులో పెట్టుకొని ఒకరిని హత్య చేసిన కేసులో నేరస్తుడిగా నిరూపించబడ్డ చౌహాన్ సుధాకర్‌కు జీవితకాలం కఠిన కారగార జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెలువడించినట్లు జిల్లా కోర్టుల సమన్వయకర్త అధికారి డల్లుసింగ్ తెలిపారు.

## మృతదేహం గుర్తింపు


వెంకటేశ్ (ఫైల్)

నర్సాపూర్ (జీ), సెప్టెంబర్ 2 : నర్సాపూర్ (జీ) మండలం కుస్లి గ్రామంలో విషాధం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కుస్లి గ్రామానికి చెందిన రామనోల్ల వెంకటేశ్ (24) అనే యువరైతు ఎప్పటిలాగే వ్యవసాయ పనుల కోసం ఆదివారం ఎడ్లబండిపై తోటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడం, సెల్ ఫోన్ స్వీచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. గాలిస్తుండగా వారి వ్యవసాయ బావిలోనే వెంకటేశ్ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ హన్మండ్లు బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా దవాఖానకు తరలించారు.

## నేడు విద్యాసంస్థలకు సెలవు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 2: నిర్మల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు సెలవు పాటించాలని సూచించారు.

ఎదులాపురం, సెప్టెంబర్ 2: అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు సెలవు పాటించాలని సూచించారు.

## నిర్మల్‌లో వైద్య శిబిరం

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 2: భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా జీఎన్ఆర్ కాలనీవాసులను ముందు జాగ్రత్తగా ఆదర్శ నగర్ ఆల్ఫోర్స్ ఉన్నత పాఠశాలకు తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, ఎంవో రమణ, పీహెచ్ఎం సుజాత పాల్గొన్నారు.

## అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 2 : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి అర్జీలు స్వీకరించారు. వివిధ గ్రామాల, మండల నుంచి ప్రజల ద్వారా వచ్చిన 35 అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు జితేందర్ రెడ్డి, సాయన్న, మనోహర్, రాజలింగు, కృష్ణ, ప్రణీత, సునీత, మిల్కా పాల్గొన్నారు.


బోథ్: ధన్నూర్(బీ) వంతెనపై నుంచి పారుతున్న వరద


ఇంద్రవెల్లి: కోతకు గురైన గిన్నేరా రోడ్డ బ్రిడ్జి


ఖానాపూర్‌రూరల్ : సదర్మాట్ ఆయకట్టు నుంచి ప్రవహిస్తున్న వరద


పెంబి: పస్పుల వద్ద వరదలకు తెగిపోయిన రోడ్డు


దిలావర్‌పూర్: కూలిన ఇల్లు

# ఎడతెరిపిలేని వర్షం


ఉట్నూర్‌రూరల్: కోతకు గురైన లక్షెట్టిపేట రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

- పొంగిపొర్లిన వాగులు
- స్తంభించిన జన జీవనం
- కూలిన వంతెనలు.. తెగిన రోడ్లు
- ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు

బోథ్, సెప్టెంబర్ 2: వాన వదలడం లేదు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు అతలాకుతలమైంది. వరదలు పోటెత్తడంతో జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోథ్ మండలం ధన్నూర్(బీ) వాగు, అందూర్ వాగు, నక్కలవాడ వాగు, పార్డి(బీ) వాగు వంతెనలపై నుంచి వరద పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు నక్కలవాడ వంతెనపై నుంచి వరద పారుతుండడంతో అక్కడ పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బోథ్‌లోని సాయినగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు అక్కడక్కడ ఇండ్లలోకి చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 2: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఉపేందర్, సీఐ భీమేశ్ అన్నారు. సిరికొండ, ఇచ్చోడ మండలాల్లో భారీ వర్షం కురవడంతో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. సిరికొండ మండలం రాంపూర్, తిమ్మాపూర్, తుమ్మల్‌పాడ్ గ్రామాల్లో రోడ్డు దెబ్బతిన్నగా వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజలు అప్రమత్తం చేశారు. తుమ్మల్‌పాడ్‌కు రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్, గోవర్ధన్ పటేల్, శంకర్ పటేల్, అసిస్టెంట్ వసంత్, కిరణ్, సీతారం ఉన్నారు.

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 2 : మండలంలోని భూతాయి, దేగామ, బజార్‌హత్నూర్, కాండ్లీ, కోల్హారి, జాతర్ల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరద వచ్చి చేరింది. చింతల్‌స్వాంగి గ్రామానికి వెళ్లే రహదారిలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో అటువైపుగా వెళ్లే గ్రామల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా దేగామ చెరువులోకి భారీగా వరద వచ్చి చేరింది. అదేవిధంగా మండల కేంద్రంలోని గాంధీనగర్, పూలజీబాబా, సాయిబాబా, భీమన్న కాలనీలు జలమయమయ్యాయి.

తాంసి, సెప్టెంబర్ 2: పొన్నారి గ్రామంలో మట్టి మిద్దె కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వడ్డాడి గ్రామంలో మురుగు కాల్వ, ర్యాంపు కోతకు గురయ్యాయి.

### కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 2: మండలంలో 180 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాటగూడ, మర్కాగూడ, లాల్‌టేకిడి, గ్రామానికి చెందిన కల్వర్టుతో పాటు రోడ్డు కోతకు గురికావడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. అంజి గ్రామం వద్ద బీటీ రోడ్డు కోతకు గురికావడంతో వాహనదారులతోపాటు ప్రజలు ఇబ్బంది పడ్డారు. జైత్రంతండా, జెండాగూడ, చిత్తబట్ట, గోపాల్‌పూర్, మామిడిగూడ గ్రామాలకు చెందిన పెద్ద వాగులు పొంగిపొర్లడంతో గ్రామాల ప్రజలు బాహ్యప్రపంచంతో సంబంధం కోల్పోయారు. మండల కేంద్రంలోని భీంనగర్, బుద్దనగర్, మిలింద్‌నగర్‌లో వరద ఇండ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 10 నుంచి సోమవారం రోజంతా విద్యుత్ రాకపోవడంతో మండల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. తహసీల్దార్, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎస్ఐ సునీల్‌తో పాటు ఇతర అధికారులు గ్రామాల్లో పర్యటించి జరిగిన నష్టాలతో పాటు కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టుల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కోతకు గురైన వాటిని పరిశీలించి జిల్లా అధికారులకు నివేదికలు పంపించనట్లు పేర్కొన్నారు.

ఉట్నూర్, సెప్టెంబర్ 2 : ఉట్నూర్‌లోని బస్టాండ్, అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో భారీగా వర్షపు నీరు చేరడంతో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా కలెక్టర్ ఆదేశాల మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నీరు వెళ్లేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఆర్డీవోను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు నీరు పారేందుకు జేసీబీ సహాయంతో నాళాలను శుభ్రం చేసి చర్యలు తీసుకున్నారు.

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 2: మండలంలోని లక్షెట్టిపేట గ్రామానికి వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న పీఆర్డీఈ రమేశ్, ఎంపీవో మహేశ్ కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు. అదేవిధంగా శ్యాంపూర్‌లోని లోతట్టు ప్రాంతాలలోని ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. ఆర్ఐ శోభారాణి గ్రామానికి వెళ్లి ఇండ్లను పరిశీలించారు. అదేవిధంగా శ్యాంపూర్ వాగుకు ఇరువైపులా పంట చేన్లు కొట్టుకుపోయాయి. గంగన్నపేట్ గ్రామంలోని వరి పంటపై నుంచి భారీగా వరద ప్రవహిస్తున్నది. పాత ఉట్నూర్‌లో సరస్వతి చెరువు కట్ట స్వల్పంగా దెబ్బతిన్నది.

### ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగ

బేల/జైనథ్, సెప్టెంబర్ 2 : ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బేల, జైనథ్ మండల సరిహద్దులోని పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువనున్న మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగ నదికి వరద ఉధృతి పెరిగింది. బేల మండలంలోని సాంగిడి, బేదోడ, మణియార్‌పూర్, గూడ, కంగర్పూర్ గ్రామాల ప్రజలు భయాందోళనతో రాత్రి వేళలో నిద్రపోకుండా అప్రమత్తంగా ఉన్నారు. రాత్రి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సాంగిడి గ్రామంలో పోలీసులు ఆధ్వర్యంలో గ్రామస్తులను అప్రమత్తం చేశారు. పెన్‌గంగ పరిహాక ప్రాంతాల్లో ఎవరు కూడా చేపలు పట్టడానికి కానీ పంట చేనులకు గాని వెళ్లకూడదని హెచ్చరించారు. అలాగే జైనథ్ మండలంలోని డొల్లార వద్ద గల పెన్‌గంగా నది వరదనీటితో ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. దీంతో పెన్‌గంగ పరివాహక గ్రామాలైన పెండల్‌వాడ, అకోలి, కోరట, కాప్రి కరంజి, ఆనంద్‌పూర్, కౌట, సాంగ్వి గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు.

జైనథ్, సెప్టెంబర్ 2 : గిమ్మ, జైనథ్, బెల్లూరి గ్రామాల్లోని చెరువులు నీటితో జలకళను సంతరించుకున్నాయి. దీంతో పాటు మండలంలోని మధ్యతరహా ప్రాజెక్టు అయిన సాత్నాల వరదతో నిండుకుండాల మారింది.

భీంపూర్, సెప్టెంబర్ 2 : భీంపూర్ మండలం అంతర్గాం గ్రామం నడుమ నుంచి ప్రవహించే చిన్న ఒర్రె వర్షాలకు ఉగ్రరూపం దాల్చింది. దీనితో అంతర్గాం మీది పల్లె నుంచి కింది పల్లెకు రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఆదిలాబాద్ నుంచి కరంజి వైపు వెళ్లే బస్సులు, వాహనాలు గంటలపాటు నిలిచిపోయాయి.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 2 : నిర్మల్ జిల్లాలో భారీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. సారంగపూర్ 37.8 మి.మీటర్లు, నిర్మల్ 26.5, లక్ష్మణచాంద 19.3, మామడ 16.3, ఖానాపూర్ 11.3. దిలావర్‌పూర్10.3, బాసర 7.0, నర్సాపూర్(జీ) 6.0, భైంసా 5.8, ముథోల్ 4.8, కుంటాల 3.3, తానూర్ 2.0, లోకేశ్వరం 1.0 కుబీర్ 0.8, మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

### రోడ్లపై నిలిచిన వర్షపు నీరు..

నిర్మల్‌లో రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షానికి రోడ్లపైకి వర్షపు నీరు వచ్చి చేరింది. స్థానిక శివాజీ చౌక్ వద్ద గల జాతీయ రహదారిపై, శాస్త్రినగర్ కాలనీలోని రహదారిపై, డాక్టర్స్ లైన్ వద్ద గల జాతీయ రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పోలీసు అధికారులు, మున్సిపల్ సిబ్బంది రోడ్డుపై విధులు నిర్వహించి వాహనదారుల ఇబ్బందులను తీర్చారు.

### సదర్మాట్‌కు జలకళ

ఖానాపూర్‌రూరల్, సెప్టెంబర్ 2: మేడంపెల్లి సదర్మాట్ ఆయకట్టుకు వరద ఉద్రిక్తత పెరిగింది. సదర్మాట్ కాలువ నీటి మట్టం పది అడుగులు నమోదు కావడంతో జలకళ సంతరించుకుంది. నిర్మల్, ఆదిలాబాద్‌లో కురిసిన భారీ వర్షలకు స్వర్ణ వాగు, మేడంపెల్లి వాగుల ద్వారా సదర్మాట్ గోదావరికి సుమారు 26,651 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. సదర్మాట్ ఆయకట్టుకు పెద్దమొత్తంలో నీరు రావడంతో రాతి గోడల ఉపరితలంపై నుంచి నీరు కిందకు ప్రవహిస్తున్నది. వరద ఉధృక్తి పెరగడంతో గోదావరి సమీపంలో పశువుల కాపరులు, రైతులు, చేపలు పట్టేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

దస్తురాబాద్, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ అన్నారు. మండలంలోని గోదావరి తీర ప్రాంత గ్రామాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. గోదావరి ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించారు. పోచంపాడ్, కడెం ప్రాజెక్ట్ నుంచి గేట్లు వదలడంతో భారీగా గోదావరిలోకి నీరు వచ్చి చేరుతుందని, గోదావరి వైపు ప్రజలు, పశు కాపరులు, మత్స్యకారులు వెళ్లవద్దని సూచించారు. అలాగే పలు గ్రామాల్లో కొన్ని ఇండ్లు కూలిపోగా, మరి కొన్ని ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎంపీడీవో రమేశ్ అధికారులతో కలిసి కూలిపోయిన ఇండ్లను, దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. అలాగే ఏఎస్ఐ శంకర్ సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పెంబి, సెప్టెంబర్ 2: కడెం, దోత్తి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు అవతలి గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. పస్పుల గ్రామంలోని కోలాంగుడ వద్ద రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీవో అనిల్ కుమార్ హరిచంద్‌తండా, లోతోర్యతండా, పస్పుల గ్రామాల్లో పర్యటించారు. వర్షాల కారణంగా ఎవరు బయటకు వెళ్లవద్దని సూచించారు. ఇటిక్యాల గ్రామంలో ఇల్లు శిథిలావస్థలో ఉండడంతో ఎంపీవో వారికి గ్రామ పంచాయతీలో తాత్కాలికంగా వసతి కల్పించారు.

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 2 : దిలావర్‌పూర్‌లో శేఖర్‌కు చెందిన ఇల్లు భారీ వర్షంతో కూలిపోయింది. పలు గ్రామాల్లో పంట పొలాల్లోనికి ఇసుక మేటలు వచ్చాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దిలావర్‌పూర్ తహసీల్దార్ స్వాతి, ఎంపీడీవో అరుణరాణి, ఆర్ఐ సంతోష్‌కుమార్ లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

కుంటాల, సెప్టెంబర్ 2 : ఓలా నుంచి లింబా (బీ), వెంకూర్ నుంచి విట్టాపూర్, ఓలా నుంచి సూర్యాపూర్‌ల మధ్య గల లోతట్టు వంతెనలపై వరద ఉధృతంగా ప్రవహించడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ దారుల్లో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. కల్లూరులో రూ. కోటికి పైగా నిధులతో నిర్మించిన చెక్‌డ్యాం కోతకు గురై నీటి నిల్వ సామర్థ్యం కోల్పోయింది. దీంతో సాగుకు నిరుపయోగంగా మారింది. సూర్యాపూర్‌లో ఒక ఇల్లు, లింబా (బీ)లో ఒక ఇల్లు పాక్షికంగా ధ్వంసమైనట్టు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలకు ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని అందరికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం నిర్మల్‌లోని జీఎన్ఆర్ కాలనీలోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కాలనీవాసులకు స్థానిక అల్ఫోర్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట రాజేందర్, రావుల రాంనాథ్, రాజు ఉన్నారు.

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 2 : భారీ వర్షాల కా రణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. నిర్మల్‌లో ఆయన పర్యటించారు. స్థానిక శాస్త్రినగర్ కాలనీలో రోడ్లపై వర్షపు నీరు నిలువడం తో నీటిని తొలిగించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఉన్నారు.

నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీకి భారీ వర్షం కారణంగా వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉండడంతో ముందస్తుగా కాలనీలోని 40 కుటుంబాలను తరలించి స్థానిక అల్ఫోర్స్ పాఠశాలలో వారికి పునరావాసం కల్పించా రు. దీంతో సోమవారం పునరావాస కుటుంబాలతో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎ లాంటి ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు.

## కొడుక్కి తలకొరివి పెట్టిన తల్లి..


రవీందర్(ఫైల్)

తాంసి, సెప్టెంబర్ 2 : కన్నతల్లి కొడుక్కి తలకొరివి పెట్టిన ఘటన కప్పర్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పర్ల గ్రామానికి చెందిన బొజ్జ రవీందర్(32) తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రవీందర్ భార్య అదే గ్రామానికి చెందిన వివాహితుడితో అక్రమ సంబంధం పెట్టుకోవడం, ఈ విషయం కాస్త ఇరుగుపొరుగు వారికి తెలువడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి రాంబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై శివరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రవీందర్‌కు తండ్రి, అన్నదమ్ములు, పిల్లలు లేకపోవడంతో కన్నతల్లి తలకొరివి పెట్టడంతో పండుగ పూట విషాదఛాయలు అలుముకున్నాయి.

## రిమ్స్‌లో 24 గంటలు వైద్యం

ఎదులాపురం, సెప్టెంబర్ 2 : వర్షకాలంలో వ్యాధులు ప్రబలతున్న నేపథ్యంలో రిమ్స్‌లో వైద్య సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. సోమవారం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో రోగుల తాకిడి పెరిగిందన్నారు. ప్రత్యేక వార్డులతోపాటు ప్రస్తుతం ఉన్న వార్డుల్లో బెడ్ల సంఖ్యను పెంచామన్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మూడు షిఫ్టుల్లో వైద్యులను టీంల ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. రక్త నమూన పరీక్షకు 24 గంటలపాటు ల్యాబ్ పని చేస్తుందన్నారు. మందుల కొరత లేదని, అవసరమైన వాటిని అప్పటికప్పుడే తెప్పించుకుంటున్నామని పేర్కొన్నారు.

## బీసీ గణన చేపట్టాలి

కుంటాల, సెప్టెంబర్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, అలాగే రాష్ట్రంలో కుల గణన, జన గణన సాధన కోసం బత్తుల సిద్ధేశ్వర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కుంటాల మండల బీసీ నాయకుడు జక్కుల గజేందర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సిద్ధేశ్వర గాంధీ దవాఖానలో చేస్తున్న దీక్ష 9వ రోజుకు చేరుకోవడంతో సోమవారం ఆయనను పరామర్శించారు. అనంతరం గజేందర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న బీసీ నాయకులు, యువకులు కులాలకు పార్టీలకు అతీతంగా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ జక్కుల ముత్యం, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు మట్టి ఎద్దుల ప్రతిమలు అందజేత

భైంసా, సెప్టెంబర్ 2 : పొలాల అమావాస్య సందర్భంగా సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు మట్టి ఎద్దుల ప్రతిమలను లోకేశ్వరం మండల బీజేపీ నాయకులు అందజేశారు. ఇక్కడ బీజేపీ మండలాధ్యక్షుడు జైసాగర్, లింగా రెడ్డి, సోలంకి భీంరావ్ ఉన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

భైంసా, సెప్టెంబర్ 2 : గడ్డెన్నవాగు ప్రాజెక్టు పరిసర ప్రాంత ప్రజలకు వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం గడ్డెన్నవాగు ప్రాజెక్టును ఆయన సందర్శించి ఆయన మాట్లాడారు. అంతేగాకుండా ప్రాజెక్టులోకి వస్తున్న వరదకు సంబంధించిన ఇన్‌ఫ్లో, బయటకు వదులుతున్న ఔట్‌ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు అధికారులంతా నిరంతరం అత్యంత అప్రమత్తంగా ఉంటూ వరదకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజేశ్, తహసీల్దార్ ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ముథోల్, సెప్టెంబర్, 2 : వర్షాల పట్ల ప్రజలు, రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీకాంత్ సూచించారు. సోమవారం మండలంలోని వడ్తాల్ వాగును పరిశీలించడంతో పాటు బోరిగాం గ్రామంలో గల శిథిలావస్థకు చేరిన ఇండ్లను పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ఇబ్బందులు ఎదురైతే తక్షణ సమాచారం అందించాలన్నారు. అధికారులు ఎప్పుడు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఆయన వెంట ఎస్ఐ సాయికృష్ణ ఉన్నారు.

## గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

ఖానాపూర్, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి వేశారు. వరద రాకతో సోమవారం ఖానాపూర్ పట్టణ శివారులో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తూ కనిపించింది. దీంతో నీటి పారుదలశాఖ అధికారులు ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల ప్రజలను అప్రమత్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. గోదావరి నది పరివాహక గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు, కరెంట్ మోటార్లు ఉన్న రైతులు, మత్స్యకారులు గోదావరి తీరానికి వెళ్లరాదని సూచించారు.

## దెబ్బ తిన్న మొక్కజొన్న పంట

దస్తురాబాద్, సెప్టెంబర్ 2 : ఆకొండపేట గ్రామంలో మడుగుల మల్లయ్య అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. అడవి పందుల దాడిలో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట పూర్తిగా ధ్వంసమైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. పందుల నుంచి తమ పంటలను అటవీ శాఖ అధికారులు రక్షించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సుగుణక్క

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 2 : ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలంలోని రాంపూర్ గ్రామంలో నీట మునిగిన పంట పొలాలు, ధ్వంసమైన రహదారులను సోమవారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క పరిశీలించారు. పంట నష్టంపై రైతులతో మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని సుగుణక్క భరోసా ఇచ్చారు.

## గడ్డెన్నవాగు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత

భైంసా, సెప్టెంబర్ 2 : భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చింది. దీంతో అధికారులు మూడు గేట్లను ఎత్తివేశారు. ఇన్‌ఫ్లో కింద 12,579 క్యూసెక్కుల నీరు రావడంతో ఔట్ ఫ్లో కింద 12, 579 క్యూసెక్కుల నీటిని వదిలారు.

## స్వర్ణ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

సారంగాపూర్, ఆగస్టు 2 : స్వర్ణ ప్రాజెక్టుకు మహారాష్ట్ర, మండలంలో వర్షాలు కురవడంతో వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 9500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా నీరు వచ్చి చేరుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1183 అడుగులు 1.484 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 1180 అడుగులు 1.272 టీఎంసీల నీటి నిల్వ ఉంది. వరద ఉధృతి ఎక్కవ కావడంతో రెండు గేట్ల ద్వారా 10,126 క్యూసెక్కుల నీటిని వరద కాలువలోకి అధికారులు వదిలి పెట్టారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

బాసర, సెప్టెంబరు 2 : బాసర గోదావరి నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. సోమవారం గోదావరి నది నీటి ప్రవాహాన్ని సీఐ మల్లేశ్, అధికారులు పరిశీలించారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, జాలర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీటి ఉధృతి అధికంగా ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. ఇక్కడ తహసీల్దార్ పవన్ చంద్ర, ఎస్ఐ గణేశ్, ఈవో గోవిందరాజు ఉన్నారు.

## ప్రభుత్వం ఆదుకోవాలి

బేల, సెప్టెంబర్ 2: మండలంలోని పెన్‌గంగ నది తీరానికి ఉన్న ఖోగ్దూర్, మాంగ్రూడ్, కొబ్బాయి, దాతాల్పూర్, గూడ, మణియార్‌పూర్, బేదోడా శివారులో ఉన్న 500 ఎకరాలు నీట మునిగాయని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు ముంగేశ్ ఠాక్రే అన్నారు. ఆదివారం మండలంలోని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పలు పంట పొలాలను పరిశీలించారు.

## సమస్యలు పరిష్కరించాలి

దస్తురాబాద్, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని ఏఈ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన సంబంధిత అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అంతకుముందు గోదావరి తీర ప్రాంతాలైన గొడిసేర్యాల, రాంపూర్, చెన్నూర్ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డుపై పడిపోయిన చెట్టును తొలగింపు

ఖానాపూర్, సెప్టెంబర్ 2 : ఖానాపూర్ పట్టణ శివారులోని కుమ్రం భీం చౌరస్తా సమీపంలో సోమవారం ఖానాపూర్–నిర్మల్ ప్రధాన రహదారిపై భారీ చెట్టు విరిగిపడింది. రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్ఐ లింబాద్రి ఘటనా స్థలానికి వెళ్లి సిబ్బందితో కలిసి చెట్టును తొలగించారు.

## ఘనంగా పొలాల అమావాస్య


తాంసి:నైవేద్యాలు సమర్పిస్తున్న మాజీ ఎంపీపీ దంపతులు

బోథ్/బజార్‌హత్నూర్/భీంపూర్/తలమడుగు/తాంసి/ఉట్నూర్/ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి/నార్నూర్/దిలావర్‌పూర్/భైంసా/భైంసాటౌన్/ముథోల్/తానూర్/కుభీర్/దస్తురాబాద్/కుంటాల, సెప్టెంబర్ 2 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా సోమవారం పొలాల అమవాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. రైతులు బసవన్నలను అందంగా అలంకరించి గ్రామంలోని ప్రధానవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. గ్రామాల్లోని పోచమ్మ, శివాలయాలు, హనుమాన్, ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఇంటి వద్ద బసవన్నలకు హారతి పట్టారు. ఇంటిల్లిపాది బసవన్నలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం తినిపించారు.

నేరడిగొండ, సెప్టెంబర్ 2 : రాజురాలో బసవన్నలకు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎదులాపురం, సెప్టెంబర్ 2: ఆదిలాబాద్ జిల్లా జైలులో సోమవారం జైలు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ అధికారులు, ఖైదీలతో కలిసి పొలాల అయావాస్య పండుగ జరుపుకున్నారు. ఎద్దుల జతలను పూజించి పరమాన్న నైవేద్యాలు సమర్పించారు.

## పీచర వద్ద తెగిన బ్రిడ్జి

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 2: పీచర సమీపంలో పీచర – సోన్ రహదారిపై ఉన్న వంతెన తెగిపోయింది. దాంతో రాకపోకలు ఆగిపోయాయి. మండలంలోని తిర్‌పెల్లి వాగుపై ఉన్న వంతెన స్వల్పంగా దెబ్బతినడంతో అధికారులు రాకపోకలు నిలిపివేసారు.

## బాలికపై కుక్కల దాడి

ఎదులాపురం, సెప్టెంబరు 2 : ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌లో నిర్విజ్ఞ (8) బాలికపై సోమవారం కుక్కలు దాడి చేశాయి. మధ్యాహ్నం బాలికపై నాలుగు కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. పాప కేకలు వేయడంతో కుటుబ సభ్యులు వచ్చి కుక్కలను వెళ్లగొట్టారు. దాడిలో బాలికకు గాయలు కాగా కుటుంబసభ్యులు ప్రైవేటు దవాఖాకు తరలించి చికిత్స అందించారు. గతంలో సైతం కాలనీలో కుక్కల భయందోళనకు గురిచేస్తున్నాయని మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీవాసులు తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జైనథ్, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలతో వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయని, వరదపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం అంతర్‌రాష్ట్ర లోయర్ పెన్‌గంగ డొల్లార బ్రిడ్జి వద్ద పెన్‌గంగ ఉధృతిని పరిశీలించారు. పెన్‌గంగ నది పరివాహక ప్రాంత ప్రజలను వరద పట్ల అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా నది తీరంలో ఉన్న గ్రామస్తులతో ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా మాట్లాడాలన్నారు. ఆనందపూర్ గ్రామ సరిహద్దు బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తోందని, అక్కడి రాకపోకలు నిలిపి వేసి ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

## ఇద్దరి అరెస్ట్

ఎదులాపురం, సెప్టెంబర్ 2 : ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ, గంజాయి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. గంజాయిని విక్రయిస్తున్న కేసులో ఈనెల 1వ తేదీన షేక్ కలీం ను అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న హనుమాన్ ధర్మజిని సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మార్కెట్ యార్డు సమీపంలో పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితున్ని తనిఖీ చేయగా 52 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మహాలక్ష్మి వాడలో సురేశ్‌కు చెందిన కిరాణ షాపులో చోరీకి పాల్పడిన ఇద్దరి నిందితుల్లో షేక్ ఆయాన్‌ను ఆదివారం పట్టుకోగా, పరారీలో ఉన్న మరో నిందితుడు హర్షద్ అలియాస్ ఇస్రత్ ఖాన్‌ను సోమవారం ఎస్ఐ విష్ణు ప్రకాశ్ అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ ఇద్దరి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## నిత్యావసర ధరలు తగ్గించాలి డిమాండ్

ఎదులాపురం,సెప్టెంబర్ 2 : కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ పేదల నడ్డివిరుస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ పిలుపుమేరకు నిత్యావసర ధరల తగ్గింపుకు సెప్టెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు చేపట్టే నిరసనలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నాయకులు రాములు, కేశవ్, అరుణ్ కుమార్, దేవీదాస్, అమీనా బేగం పాల్గొన్నారు.

## కంట్రోల్ రూంను తనిఖీ చేసిన కలెక్టర్

ఎదులాపురం, సెప్టెంబర్ 2 : ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ.. తెలంగాణలో మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టులను పరిశీలిస్తూ ఉండాలని, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అవసరం అయితే తప్పా బయటకు రావొద్దని తెలిపారు. అవసరమైతే విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఏవో రామిరెడ్డి, సూపరింటెండెంట్ వర్ణ పాల్గొన్నారు. కాగా.. కలెక్టర్ రాజర్షి షా సాయంత్రం కంట్రోల్ రూంను ఆకస్మికంగా తనిఖీ చేసి నంబర్‌కి కాల్ చేసి పని చేస్తుందో లేదో పరిశీలించారు.